సాక్షి
నంద్యాల
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



ఆదాయం రూ. 1.48 లక్షలు

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామికి శనివారం భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో దేవస్థానానికి రూ.1,48,025 ఆదా యం వచ్చినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు.



మర్యాద పూర్వకంగా మెలగండి

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చిన భక్తులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. 8లో▸



శివయ్యా.. శరణు..శరణు!

శివయ్యా.. శరణు.. శరణు అంటూ భక్తులు పాదయాత్రతో మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి కృష్ణమ్మకు ప్రత్యేక వాయనం సమర్పిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు శ్రీశైలానికి రాష్ట్ర గవర్నర్ రాక

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు సోమవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శ్రీశైలం రానున్నారు. సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంట హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం భ్రమరాంబా అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకుని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారు. అనంతరం రాత్రికి అతిథి గృహంలోనే బస చేసి మంగళవారం ఉదయం విజయవాడకు తిరిగి వెళ్తారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రద్దయిన సీఎం పర్యటన..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నట్లు అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే సీఎం పర్యటన వివిధ కారణాల వలన రద్దయిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



కోవెలకుంట్ల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ సునీత

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈఓ సునీత తెలిపారు. శనివారం ఆమె జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులు మనమిత్ర యాప్‌తో వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అలాగే http://bie.ap.gov.inలో విద్యార్థుల ఆధార్ నెంబరుతో, రెండవ సంవత్సరం విద్యార్థులు గత ఏడాది హాల్‌టికెట్ నెంబర్ ఆధారంగా హాల్‌టికెట్ పొందవచ్చన్నారు. నంద్యాల జిల్లాలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 14,239 మంది, ఒకేషనల్ 1,456 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం జనరల్ విద్యార్థులు 12,230 మంది, ఒకేషనల్ 11,070 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

రేనాటి సూరీడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి



నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ, అధికారులు


నంద్యాల: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి రేనాటి సూరీడు అని డీఆర్‌ఓ రాము నాయక్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నరసింహారెడ్డి 178వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సాంప్రదాయ వ్యవసాయ వ్యవస్థలో బ్రిటీషయులు చేసిన మార్పులకు వ్యతిరేకంగా నరసింహారెడ్డి పోరాటం చేశారన్నారు. 1806 నవంబర్ 24న కర్నూలు జిల్లాలోని రూపనగుడిలో జన్మించి స్వాతంత్ర్య సాధన కోసం బ్రిటీష్ పాలకులతో వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆయన 1847 ఫిబ్రవరి 22న వీరమరణం పొందారన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, మనోహర్ రెడ్డి, తిరుపంరెడ్డి, సాయిరాంరెడ్డి, శివకుమార్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మాలల యుద్ధగర్జన'

కర్నూలు(అర్బన్): రిజర్వేషన్లలో ఎస్సీ ఉప వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం కర్నూలులో భారీగా రాయలసీమ మాలల యుద్ధగర్జన సభను నిర్వహిస్తున్నట్లు మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు, గౌరవాధ్యక్షులు గోన నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్, అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకట్రావ్, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, స్వర్గీయ పీవీ రావు సోదరుడు పీఎస్ఎన్ మూర్తి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో మాలలు ఈ సభకు రానున్నారని చెప్పారు.

చిత్రసీమ వైభవం

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో సినిమాలు తీస్తే బ్లాక్ బస్టర్ అనే సెంటిమెంట్
- షూటింగ్ స్పాట్లుగా కొండారెడ్డిబురుజు, రాక్ గార్డెన్స్, యాగంటి, అహోబిలం
- ఇప్పటికే పదుల సంఖ్యలో సినిమాల చిత్రీకరణ
- క్రమంగా పెరుగుతున్న సినిమా షూటింగులు



సినిమా షూటింగ్‌లో కొండారెడ్డి బురుజు వద్ద సినీ హీరో మహేష్ (ఫైల్)

సండే స్పెషల్

ఓర్వకల్లు సమీపంలోని రాక్ గార్డెన్స్.. సినిమా చిత్రీకరణకు భళా అనిపిస్తోంది. కర్నూలులోని కొండారెడ్డి బురుజు రాజసం చిత్రాల్లో కనిపిస్తోంది. అహోబిల క్షేత్రం పలు సినిమాల్లో కనిపించి ప్రేక్షకులకు ఆధ్యాత్మికతను పంచుతోంది. యాగంటి క్షేత్రంలో సైతం సినిమాల చిత్రీకరణ సాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నల్లమల అడవులు కూడా పలు సినిమాల్లో కనిపించడంతో ప్రకృతి రమణీయత వెలుగులీనింది. మంత్రాలయం వైభవం తెలుగు, కన్నడ సినిమాల్లో పరిమళిస్తోంది. సినిమాల నిర్మాణానికి కర్నూలు 'బాహుబలి'గా నిలుస్తోందనే ప్రశంస అంతటా వినిపిస్తోంది.

కర్నూలు కల్చరల్: రాయలసీమ ముఖద్వారమైన ఉమ్మడి కర్నూలు జిల్లా సినిమాల చిత్రీకరణకు అనుకూలంగా ఉంటోంది. రాష్ట్ర విభజన తర్వాత సినిమా షూటింగులు ఎక్కువగా కర్నూలులో జరుగుతున్నాయి. కొండారెడ్డి బురుజు బొమ్మ సినిమాలో కనబడితే కచ్చితంగా హిట్టు అవుతుందని చాలా మంది దర్శకుల నమ్మకం. సినిమా హీరోలు సైతం తమ సినిమాల్లోని కొన్ని దృశ్యాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిత్రీకరించేందుకు ప్రణాళిక చేయిస్తుంటారు. ఇక్కడ షూటింగ్స్ చేసిన సినిమాలు బ్లాక్ బస్టర్లుగా నిలిచాయి. ఆ సెంటిమెంటే చిత్రసీమ కెమెరా లెన్స్ కందనవోలుపై పడేలా చేసింది. ఇటీవల విడుదలైన పుష్ప–2, గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ తదితర సినిమాల్లో పలు సన్నివేశాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిత్రీకరించారు.

సీమ యాసకు ప్రాధాన్యం



సినీ నటుడు జయ ప్రకాష్‌రెడ్డి (ఫైల్)

'ప్రేమించుకుందాం రాం' సినిమాతో కర్నూలు సెంటిమెంట్ మొదలైందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. రాయలసీమ యాసను జయప్రకాష్ రెడ్డితో మాట్లాడించి గుర్తింపు తెచ్చారు దర్శకులు. ఆ తర్వాత కర్నూలులో చిత్రీకరించిన సినిమాలు నిర్మాతలకు కాసులు కురిపించాయి. కొందరు హీరోలు సెంటిమెంట్‌గా కర్నూలులోని ప్రదేశాలను ఫిల్మ్‌సిటీల్లో సెట్టింగ్స్ వేసి మరీ విజయాలు సొంతం చేసుకుంటున్నారు. అలా వచ్చిందే మహేష్‌బాబు సినిమా. కొండారెడ్డి బురుజు దగ్గర విలన్ పాత్రధారి ప్రకాష్ రాజ్‌పై హీరో మహేష్ బాబు చేయి చేసుకునే సీన్ హిట్ అయ్యింది. మళ్లీ 17 ఏళ్ల తరువాత అదే కొండారెడ్డి బురుజు సెట్టింగ్‌తో హైదరాబాద్‌లో సినిమా పూర్తి చేసి 'సరిలేరు నీకెవ్వరు' మరోహిట్ కొట్టింది. హీరో దగ్గుపాటి రాణా నటించిన నేనే రాజు – నేనే మంత్రి, రామ్‌చరణ్ హీరోగా నటించిన గేమ్ ఛేంజర్, సందీప్ కిషన్ నటించిన తెనాలి రామకృష్ణ సినిమాల చిత్రీకరణ కర్నూలు నగరంలోనే జరిగింది.



రాక్ గార్డెన్స్‌లో షూటింగ్‌లో దర్శకుడు రాజమౌళి (ఫైల్)



సినిమాల చిత్రీకరణకు ముఖ్య ప్రాంతాలు ఇవీ..

- కొండారెడ్డి బురుజు వేదికగా ఒక్కడు, సరిలేరు నీకెవ్వరు, సమరసింహారెడ్డి, సీతయ్య, ప్రేమించు కుందాం రాం.. తదితర సినిమాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించారు.
- నరసింహ నాయుడు, శంభో శివ శంభో, తెనాలి రామకృష్ణ తదితర సినిమాల్లో ప్రముఖ ఘట్టాలను కర్నూలులోనే తీశారు.
- ఓర్వకల్లు రాక్ గార్డెన్స్‌లో బాహుబలి, జయం మనదేరా, సుభాష్ చంద్రబోస్, టక్కరి దొంగ తదితర సినిమాల్లో పలు సన్నివేవాలు చిత్రీకరించారు.
- అహోబిలంలో లక్ష్మీనరసింహ, యాగంటిలో నేనే రాజు నేనే మంత్రి, గద్దల కొండ గణేశ్ తదితర చిత్రాల్లో ఘట్టాలను నిర్మాణం చేయగా.. అవి హిట్ కొట్టాయి.
- మంత్రాలయం పరిధిలో కొన్ని తెలుగు, కన్నడ సినిమాల చిత్రీకరణ జరిగింది. ప్రభాస్ హీరోగా రాఘవేంద్ర సినిమా మంత్రాలయంలోనే తీశారు.
- కర్నూలు జిల్లాలో పుష్ప సినిమాలో కొన్ని ఘట్టాల షూటింగ్ జరిగింది. ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది.
- నంద్యాల సమీపంలోని నల్లమల అడవుల్లో క్షణక్షణం, రౌడీ ఇన్‌స్పెక్టర్, బొబ్బిలి రాజా చిత్రాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించారు.

యాగంటిపై ఆసక్తి

యాగంటిలో షూటింగ్ జరిగిన సినిమాలు హిట్ కొట్టాయి. యాగంటి కొలను, మెట్ల వద్ద పలు సినీ సన్నివేశాలు తీశారు. సీనియర్ ఎన్టీఆర్ నటించిన పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, నాగార్జున నటించిన అన్నమయ్య, వెంకటేష్ నటించిన జయం మన దేరాం, అరంధతి చిత్రాల్లో కొన్ని సీన్లు బనగానపల్లి పరిసర ప్రాంతాల్లో తీశారు. ఈ చిత్రాలు విజయవంతమవ్వడంతో దర్శకులు యాగంటిని సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. 2016లో నాపరాయి గనుల నడుమ బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా 'స్పీడున్నోడు' మూడు రోజుల పాటు పలుకూరులో చిత్రీకరించారు. బెలుం గుహల్లో సాహసం, స్వామి రారా నిఖిల్ సినిమా షూటింగ్ జరిగింది. హరీష్‌శంకర్ దర్శకత్వంలో రూ.20 కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన గద్దలకొండ గణేష్ చిత్రం విజయం సాధించింది.



కర్నూలులోనే శత దినోత్సవాలు

సినిమా విజయోత్సవాలు, ప్రీరిలీజ్ ఈవెంట్‌లకు కర్నూలు వేదికైంది. గుణశేఖర్ డైరక్టర్‌గా హీరోహీరోయిన్లు చిరంజీవి, అంజలాజువేరి నటించిన చూడాలని ఉంది సినిమా శత దినోత్సవ వేడుకలు కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగాయి. హీరో వెంకటేష్, హీరోయిన్ సౌందర్య నటించిన ఇంట్లో ఇల్లాలు, వంటింట్లో ప్రియురాలు, పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన సుస్వాగతం సినిమాల విజయోత్సవ వేడుకలు కర్నూలులోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగాయి. హీరో నాగార్జున నటించి ఘోష్ట్, రవితేజ సినిమా మిస్టర్ బచ్చన్, మహేష్‌బాబు గుంటూరు కారం, బాలకృష్ణ అఖండ, గోపీచంద్ రామబాణం, నిఖిల్ కార్తీకేయ –2 సినిమాల ప్రీరిలీజ్ ఈవెంట్స్ కర్నూలు నగరంలో జరిగాయి.

సినీ వేడుకలో హీరోలు అక్కినేని నాగార్జున, చైతన్య, అఖిల్ తదితరులు (ఫైల్)

చిత్ర పరిశ్రమకు కర్నూలు కలిసి వస్తోంది



రాష్ట్ర విజన తర్వాత సినిమా రంగం హైదరాబాద్‌లో స్థిరపడింది. కర్నూలు జిల్లాలో షూటింగ్ జరిగితే ఆ సినిమా హిట్ అవుతుందనే సెంటిమెంట్ దర్శకులకు ఉంది. హైదరాబాద్ సిటీకి కర్నూలు దగ్గరగా ఉంది. కర్నూలులో షూటింగ్ స్పాట్లు ఉండటం సినీవాళ్లకు కలిసి వస్తోంది. స్థానిక కళాకారులకు సినిమాల్లో అవకాశాలు కల్పిస్తే మరింత జనాదరణ వస్తుంది.

– పత్తి ఓబులయ్య, ట్రెజరర్, ఏపీ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్

రాయలసీమకు ప్రాధాన్యం ఇవ్వాలి



కర్నూలు జిల్లాలో షూటింగ్ జరుపుకున్న సినిమాలు దాదాపు 90 శాతం విజయం సాధించాయి. కరోనా కంటే ముందు చాలా సినిమాల షూటింగ్‌లు కర్నూలులో జరిగాయి. అవి హిట్ కొట్టాయి. మన ప్రాంతం నుంచి చాలా మంది సినీ పరిశ్రమలో ఉన్నారు. వీరితో పాటు మిగతావారు సైతం రాయలసీమలో సినిమా షూటింగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. – బైటింటి మీనాక్షిరెడ్డి, సినీ నటుడు

మురిసిన ముక్కంటి

- శ్రీగిరిలో అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- మయూర వాహనంపై మల్లన్న విహారం
- పరమేశ్వరుడిని దర్శించుకుని పరవశించిన భక్తులు



మయూర వాహనంపై ఆలయ ప్రదక్షిణలో ఆదిదంపతులు



మహిళల కోలాటం



దేవుళ్ల వేషధారణలతో కళాకారులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

శ్రీశైలంటెంపుల్: ఓ వైపు ప్రణమిల్లుతున్న భక్త కోటి.. మరో వైపు బ్రహ్మోత్సవ వైభవంతో శ్రీగిరి క్షేత్రం శోభిల్లుతోంది. ఇరుముడితో తరలివచ్చిన శివ స్వాములు స్పర్శ దర్శనం చేసుకుని పులకించిపోతున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు శనివారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై విహరించగా భక్తులు దర్శించుకుని పరవశించిపోయారు. ముందుగా ఉభయ దేవాలయాల ప్రాంగణంలోని అలంకార మండపంలో మయూర వాహనాన్ని సుగంధ పుష్పాలతో ముస్తాబు చేసి స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులను చేశారు. ఉభయదేవాలయల ప్రధాన అర్చకులు, వేద పండితులు అర్చనలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం గంగాధర మండపం నుంచి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. కళాకారుల ప్రదర్శనలు కొనసాగుతుండగా, భక్తుల శివ నామస్మరణ హోరెత్తుతుండగా మయూర వాహనంపై శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున విహరించారు. స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు రావణవాహన సేవ నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

కాణిపాకం, టీటీడీ తరఫున పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరఫున ఉదయం ఆ దేవస్థాన ఈవో కె.పెంచలకిషోర్ దంపతులు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్లకు సాయంత్రం పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ ఈఓ శ్యామలరావు పట్టువస్త్రాలు తీసుకు రాగా శ్రీశైల దేవస్థాన ఈవో, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

15 నిమిషాలు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

- నేడు గ్రూపు–2 మెయిన్స్ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): గ్రూపు–2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్ష రాసే వారు 15 నిమిషాలు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి అనుమతించబోమని ఏపీపీఎస్సీ ప్రకటించింది. గ్రూపు–2 మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు కార్డుతోపాటు హాల్‌టిక్కెట్‌తో కేంద్రంలోకి వెళ్లాలి. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండో పేపర్‌ను నిర్వహిస్తారు. కర్నూలు జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 9,993 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల ఏర్పాట్లు, అధికారుల సమన్వయం కోసం జేసీ డాక్టర్ బి.నవ్యను కోర్డినేట్ అధికారిగా ఏపీపీఎస్సీ నియమించింది. గ్రూపు–2 మెయిన్స్ రాత పరీక్షకు వచ్చే అభ్యర్థులు సందేహాలను నివృత్తికి 08518-277305కు ఫోన్ చేయవచ్చని జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు.

డెయిరీకి జగత్ విఖ్యాత్‌రెడ్డి డీఫాల్టర్

తీసుకున్న అప్పు తక్షణమే చెల్లించాలి

- బోర్డు మీటింగ్ అనంతరం చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి
- మందీ మార్బలంతో డెయిరీలోకి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ
- ఎండీ సీట్‌లో కూర్చొని హల్‌చల్
- పరస్పర సవాళ్లతో వేడెక్కిన రాజకీయం



మాట్లాడుతున్న డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): జగత్ విఖ్యాత్‌రెడ్డి డెయిరీ నుంచి డబ్బు తీసుకొని డీఫాల్టర్ అయ్యారని.. సొసైటీ ప్రెసిడెంట్‌గా అనర్హుడు కాబట్టే చక్రవర్తులపల్లె సొసైటీని రద్దు చేశామని విజయడెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం డెయిరీలో బోర్డు మీటింగ్ నిర్వహించారు. అయితే విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ మందీ మార్బలంతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. వెంటనే పోలీసులు డెయిరీ వద్దకు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. వచ్చీ రావడంతోనే ఎమ్మెల్యే.. ఎండీ ప్రదీప్‌కుమార్ సీట్‌లో కూర్చొని హల్‌చల్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే తిష్టవేయడంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కు మంటూ గడిపారు.

- ఇదిలా ఉంటే బోర్డు మీటింగ్ అనంతరం చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తన అనుచరులను వెంటేసుకొని డెయిరీలోకి వచ్చి హల్‌చల్ చేస్తే ఊరుకొనేది లేదన్నారు. తమ్ముడు విఖ్యాత్ రెడ్డిని చైర్మన్‌ను చేసేందుకు అఖిలప్రియ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. జగత్ విఖ్యాత్ రెడ్డి డెయిరీకి డీఫాల్టర్‌గా ఉన్న విషయాన్ని ఆమె మరువరాదన్నారు. అప్పటి డెయిరీ చైర్మన్ భూమా నారాయణ రెడ్డి నుంచి జగత్ డెయిరీ పాల నాణ్యత చూపి రూ.1.40 కోట్లు రుణంగా తీసుకొని డీ ఫాల్టర్‌గా ఉన్న జగత్ విఖ్యాత్‌రెడ్డి తిరిగి రుణం చెల్లించే వరకు డైరెక్టర్ కాలేదన్నారు. గతంలో తన సీట్‌లో కూర్చోవడం, ప్రస్తుతం ఎండీ సీట్‌లో కూర్చుంటే ప్రశ్నించేవారు లేరనుకుంటున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయంలో నడుస్తున్న డెయిరీ జోలికి రావద్దని, డెయిరీలో అవినీతి జరిగితే ఏ విచారణకైనా తాము సిద్ధమన్నారు. తాను రైతు బిడ్డనని, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.45కోట్లు డెయిరీకి ఆదాయాన్ని ఇచ్చామని.. పాడిరైతులు, ఉద్యోగులకు డెయిరీ ఏర్పాటు నుంచి తొలిసారి బోనస్ అందించిన చరిత్ర తమదని, తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.
- ఇదే సందర్భంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ ఐదేళ్లుగా డీఫాల్టర్ అయినప్పటికీ తమ్ముడు విఖ్యాత్‌రెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. చైర్మన్ సీటు పోతుందనే భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నోటీసులు ఇప్పుడెందుకు ఇస్తున్నారో అర్థం కావడం లేదని, కాలమే సమాధానం చెబుతుందన్నారు. సమావేశంలో డెయిరీ డైరెక్టర్ పీపీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో ఉద్యాన పంటల అభివృద్ధి



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ గోపాల్

మహానంది: వాణిజ్య ఉద్యాన పంటల అభివృద్ధికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం నూతన పద్ధతులను రూపొందిస్తోందని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గోపాల్ అన్నారు. మహానంది సమీపంలోని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రాంగణంలో శనివారం ఉద్యాన కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైఎస్సార్ హెచ్‌యూ వ్యవసాయ పరిశోధన, శిక్షణ, సాంకేతిక సేవల ద్వారా మహానంది మండలంలో రైతులు హార్టికల్చర్ రంగంలో రాణిస్తున్నారన్నారు. ఉద్యాన పరిశోధనా స్థానాల్లో ఎక్కువగా ఉల్లి, పసుపు, అరటి, ధనియాలు రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కొబ్బరి ప్లాంటేషన్‌పై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, మహానంది హెచ్‌ఆర్ఎస్ హెడ్ సైంటిస్ట్ డాక్టర్ ముత్యాల నాయుడు, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ లాగూర్ నాయక్, డాక్టర్ కిషోర్, తదితరులు పాల్గొని రైతులకు సలహాలు ఇచ్చారు.

క్లుప్తంగా

రైలు నుంచి పడి యువకుడి మృతి?


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఆదోని సెంట్రల్: రైలు నుంచి పడి ఓ యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య శనివారం విలేకరులకు తెలిపారు. రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డారా.. ఆత్మహత్యకు పాల్పడ్డారా విషయం తెలియలేదన్నారు. ఆదోని నగరూర్, రైల్వే స్టేషన్ మధ్య రైల్వే ట్రాక్ పక్కన మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడు వయస్సు 30 ఏళ్లు ఉంటాయన్నారు. మృతుడి దగ్గర పగిలిపోయిన మొబైల్ ఫోన్ తప్ప మిగతా అధారాలు దొరకలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెళ్లిపెద్దకు ఆహ్వానం

మహానంది/నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి సందర్భంగా మహానందిలో జరిగే కల్యాణోత్సవానికి పెళ్లిపెద్దగా వ్యవహరించే నంద్యాల బ్రహ్మానందీశ్వరస్వామిని ఆహ్వానించేందుకు శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వరస్వామి శనివారం సాయంత్రం నంద్యాలకు చేరుకున్నారు. మహానంది ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నంద్యాలకు ఉత్సవంగా బయలుదేరారు. నంద్యాల చెరువు కట్ట వద్ద వేదపండితులు స్వాగతం పలికారు. ఆదివారం పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మానందీశ్వరస్వామి, పార్వతీదేవిని మహానందికి తీసుకెళ్లనున్నారు.


పల్లకీలో నంద్యాలకు బయలుదేరిన మహానందీశుడి దంపతులు


శ్రీశైలం వైపు పాదయాత్ర భక్తుల అడుగులు


శివదీక్షా శిబిరాల్లో జ్యోతిర్ముడి సమర్పిస్తున్న శివస్వాములు


శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి బారులుదీరిన భక్తులు

శివయ్యా.. శరణు..శరణు !

ఇల కైలాసమైన శ్రీగిరిలో ప్రణవనాదం హోరెత్తుతోంది. నల్లమల గిరుల్లో భక్తుల మల్లన్న నామస్మరణ మారుమోగుతోంది. శివయ్యా.. శరణు శరణు అంటూ మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పాదయాత్రగా తరలివస్తున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి కృష్ణమ్మకు ప్రత్యేక వాయనం సమర్పిస్తున్నారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు నిండి పోయాయి. జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు.

– శ్రీశైలంటెంపుల్




కైలాస ద్వారానికి చేరుకున్న భక్తజనం


పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పాదయాత్ర భక్తుల భద్రతపై నిఘా

- కైలాసద్వారం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు



శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నల్లమల అటవీప్రాంతం మీదుగా పాదయాత్ర చేసుకుంటూ వచ్చే భక్తుల భద్రత కోసం శ్రీశైల దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈ నెల 19న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి కైలాస ద్వారం వద్ద రెండు అధునాతన టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి విద్యుత్ సౌకర్యం లేనప్పటికీ సోలార్ సహాయంతో ఇవి పని చేస్తాయి. ఈ కెమెరాలు సుమారు భీమునికొలను వరకు పాదయాత్ర భక్తుల పుటేజ్ రికార్డు చేస్తాయి. నల్లమల అడవిలో పాదయాత్ర భక్తులకు ఏదేని సమస్య వచ్చిన తక్షణమే సీసీ కెమెరాల ద్వారా తెలుసుకుని తక్షణ సహాయం అందిస్తున్నారు. అలాగే ప్రస్తుతం దేవస్థానంలో ఉన్న సుమారు 600 సీసీ కెమెరాలకు తోడు అదనంగా మరో 29 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. శివస్వాముల పీపుల్ కౌంటింగ్‌కు ప్రత్యేక సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూం వద్ద ఉన్న వీడియో వాల్‌లో వెయ్యి కెమెరాలను చూసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు.

ప్రతి జర్నలిస్టు ఈ–శ్రమ్ కార్డును పొందండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు

- ఏపీడబ్ల్యూజేఎఫ్ అవగాహన సదస్సులో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు

కర్నూలు(సెంట్రల్): సామాజిక భద్రతకు ప్రతి జర్నలిస్టు ఈ–శ్రమ్ కార్డును పొందాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని డీపీఆర్‌ఓ కార్యాలయ ఆవరణలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఈ–శ్రమ్ కార్డుపై అవగాహన కార్యక్రమం నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఐఅండ్ పీఆర్ డీడీ జయమ్మ, లేబర్ ఆఫీసర్ రామ్ ప్రసాదు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఇంకమ్‌ట్యాక్స్ చెల్లించని జర్నలిస్టులు ఈ–శ్రమ్ కార్డు పొందవచ్చన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేని వారందరు కూడా అర్హులేన్నారు. ఈ–శ్రమ్ కార్డు ఉంటే ప్రమాదంలో మరణిస్తే రూ.2లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ.లక్ష పరిహారం కుటుంబ సభ్యులకు అందుతుందన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వానికి విశేష స్పందన

ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ నాగేంద్ర మొదటి సభ్యత్వాన్ని ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుస్సేన్‌కు అందజేశారు. అనంతరం అక్కడికక్కడే దాదాపు 20మందికిపైగా జర్నలిస్టులు ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వం తీసుకున్నారు.

చెత్త రహిత గ్రామాలే లక్ష్యం


జి.భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి

కర్నూలు(అర్బన్): జిల్లాలో చెత్త రహిత గ్రామ పంచాయతీలే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 484 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 412 గ్రామ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ (సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్) కేంద్రాలు పూర్తయ్యాయన్నారు. ఇంకా పూర్తి కాని, మరమ్మతులు చేపట్టాల్సిన షెడ్లను గుర్తించి, పనులను చేపట్టనున్నామన్నారు. ఇందుకు పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు రూ.1.87 కోట్లతో 110 షెడ్లను పలు రకాల రిపేర్లకు అంచనాలను రూపొందించారన్నారు. పూర్తయిన కేంద్రాలకు తడి, పొడి చెత్తను తరలించి వర్మీ తయారీతో గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకునేందుకు వీలుగా అన్ని మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 1 నుంచి 31వ తేది వరకు గార్గేయపురం, చిన్నటేకూరు, కోడుమూరు, పత్తికొండ, ఆస్పరి, ఆలూరు, మంత్రాలయం, కౌతాళం, పెద్దహరివాణం, హోళగుంద మండలలాల్లో ఈ సమావేశాలను నిర్వహించనున్నామన్నారు. అలాగే ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

టీడీపీ నేతలు దాడులు చేస్తే కేసు నమోదు చేయరా?

- బోయ సురేంద్రకుమార్ ఫిర్యాదును పట్టించుకోరా?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం సుభాష్ చంద్రబోస్


దాడి ఘటన వివరాలు సుభాష్‌కు వివరిస్తున్న బోయ సురేంద్రకుమార్

కర్నూలు(అర్బన్): 'టీడీపీ నేతలు దురుద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసినా పోలీసులు కేసు నమోదు చేయరా' అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం సుభాష్ చంద్రబోస్ ప్రశ్నించారు. కృష్ణగిరి మండలం రామకృష్ణాపురంలో వైఎస్సార్‌సీపీకి చెందిన బోయ సురేంద్రకుమార్ అలియాస్ సుభాష్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత దామోదర్‌నాయుడు, అతని అనుచరులు ఈ నెల 19న వేటకొడవళ్లు, రాడ్లతో దాడి చేసి హత్యాయత్నం చేశారని, అయినా పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. బాధితులు శనివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగరంలోని సుభాష్ నివాసానికి వచ్చి దాడి వివరాలను తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన తనను అంతమొందిస్తే గ్రామంలో తిరుగు ఉండదనే ఉద్దేశంతో దామోదర్‌నాయుడు, అతని సోదరులు బరితెగించారన్నారు. తనపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నం చేశారని బాధితుడు సురేంద్రకుమార్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో దామోదర్‌నాయుడి అరాచకాలు మితిమీరిపోయాయన్నారు. ప్రస్తుతం ఆయన భార్య సర్పంచ్‌గా ఉన్నారని, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నేను పోటీకి వస్తాననే ఉద్దేశంతో అడ్డుతొలగించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బోయ సురేంద్రకుమార్ వాపోయారు. టీడీపీ నేత, అతని అనుచరుల దాడిలో తనకు బలమైన గాయాలయ్యాయన్నారని, ఇందుకు సంబంధించి అదే రోజున (19వ తేదీన) కృష్ణగిరి ఎస్‌ఐ, సీఐకి ఫిర్యాదు చేశామని, కానీ ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. తన మామ ఎర్రమల మద్దిలేటి టీడీపీ నేత దాడిని అడ్డుకున్నారని, లేదంటే తనను చంపేసేవారని ఆందోళన వ్యక్తం చేశారు. తనపై దాడికి పాల్పడిన దామోదర్ నాయుడు, అతని సోదరులపై వెంటనే కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన చేస్తామన్నారు.

భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగండి

- జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్

శ్రీశైలం: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి తరలి వచ్చిన భక్తులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. శనివారం రాత్రి భ్రమరాంబా వీఐపీ అతిథి గృహ ప్రాంగణంలో బందోబస్తుపై వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. దాదాపు 2 వేల మంది పోలీసు సిబ్బందితో బ్రహ్మోత్సవాలకు బందోబస్తు కల్పిస్తున్నామన్నారు. పోలీసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అవసరమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. బందోబస్తు పోలీసులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా అందరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఐపీఎస్ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే , అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యం

- వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి


మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్‌లో బాధ్యతలు తీసుకున్న వారు హిందూ ధర్మాన్ని కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. పుల్లారెడ్డి కళాశాల సమీపంలోని విజ్ఞాన పీఠంలో వీహెచ్‌పీ రెండు రోజుల అభ్యాస వర్గ శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటరామయ్య మాట్లాడుతూ.. వీహెచ్‌పీ కార్యకలాపాలను విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రాణేష్, అభ్యాస వర్గ అధికారి అనంత విశ్వప్రసాద్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, సహ కార్యదర్శులు గిరిబాబు, ఈపూరి నాగరాజు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీపావని తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన శంకర్ (ఫైల్)

బొమ్మలసత్రం: టెక్కె మార్కెట్ యార్డు సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన శంకర్ (45) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో స్టాంప్ రైటర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డు వద్ద రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా ఎదురుగా అతివేగంతో వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వచ్చి బైక్ ఢీకొని శంకర్ మృతికి కారణమైన నిందితుడు దినేష్ రెడ్డిపై మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళాలు

కర్నూలు(అర్బన్): సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈ నెల 28, మార్చి 4, 14, 18, 28వ తేదీల్లో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ తెలిపారు. మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన తదితర సామాజిక వర్గాలకు చెందిన యువత వారి అర్హతలను అనుసరించి https://seedap.ap.gov.in వెబ్‌సైట్‌లో యూత్ రిజిస్ట్రేషన్ కాలమ్‌ను క్లిక్ చేసి కోర్సు వివరాలను నమోదు చేయాలని తెలిపారు. వివరాలకు 9848864449, 9160903300ను సంప్రదించాలన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

- ఎస్‌పీఎఫ్ డీజీపీ త్రివిక్రమ్ వర్మ


రెడ్‌క్రాస్ వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎస్‌పీఎఫ్ డీజీపీ త్రివిక్రమ్ వర్మ

శ్రీశైలం: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్‌పీఎఫ్ డీజీపీ త్రివిక్రమ్ వర్మ అన్నారు. శనివారం ఆయన కైలాస ద్వారంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. మెడికల్ సొసైటీ శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగేశయ్యతో మాట్లాడి వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబులెన్స్‌లో ఉన్న ఈసీజీ ఆక్సి మీటర్, కాన్సన్‌ట్రేటర్, బీపీ చెకింగ్ మిషన్, తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ కె.ప్రసాద్, విజయలక్ష్మి, బసవరాజు, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.